
# కర్మవీరుడు

పచ్చ పచ్చగా ఏపుగా పెరిగి, గాలికి అల్లల్లాడి పోతూ వున్న తన పంట పొలాన్ని చూసి, కాశీనాథ్ మనస్సులో బ్రహ్మానందం అనుభవిస్తూంటాడు. ఈ పంటభూములే అతని జీవితాశాకిరణాలు...యిదంతా తన కష్టార్జితం అన్న ఊహ వచ్చినప్పుడల్లా కాశీనాథ్ ఆనందంలో తలమునకలై పోతాడు. హృదయం అట్టడుగునుండి మధురమైన నూతనసంగీతం పొంగివస్తుంది. తక్షణమే ముఖంమీద ఒక వింత కాంతి మెరుపులా ప్రత్యక్షమౌతుంది. మళ్ళీ

మోహియాం హీరాలాల్ రాయ్
అనువాదం : చంద్రం





ఒకసారి కండ్లారా పంటభూమినంతటినీ ప్రేమార్ద్ర దృష్టులతో పరిశీలించి, ఈ పొలాలే తమ బ్రతుకులకు ఆధారభూతాలనీ, యీ పచ్చని పంటలో ప్రస్ఫుటమయే అమాయకమైన ప్రకృతి సౌందర్యం పరమాత్మకు ఆకరమైందనీ అనుకుని మురిసిపోతూంటాడు. గాలికి రెపరెపలాడుతూ, తలలూపుతున్నప్పుడల్లా, కాశీనాధ్, అవి తన శ్రమశక్తిని అభినందిస్తూ తనని ఆహ్వానిస్తున్నా యనుకునేవాడు. అవి తనతో మాట్లాడుతూన్నట్లు ఊహించేవాడు పంటచేను గట్లమీదుగానూ, వాటి మధ్యగానూ వెడుతూ, ఆప్యాయంగా వాటి తలలని నిమురుతూ వున్నప్పుడు "మేమంతా నీ శ్రమవల్ల చిరునవ్వు నవ్వుతూన్నాం సుమా !" అని ఆ పైరు మొక్కలు అంటున్నట్టు వినిపించేది. "నీవు శ్రమను ధారపోయకపోతే మేమింత కళాత్మకంగా వుండం. కష్టం చేయకపోతే భూమాత కనికరించదు. శ్రమ యజ్ఞంతో నీవు భూమితల్లి ఆశీస్సులను పొందావు. భూమాత కారుణ్యానికి సజీవ చిహ్నాలుగా మేం అభివృద్ధిచెందుతున్నాం. నీ దండలలో బలం, రక్తం వున్నంతవరకూ ఇలా చిరునవ్వు నవ్వుతూనేవుంటాం. అప్పటివరకూ దినదినం నూతన జీవితాన్ని ప్రసాదిస్తుంటాం దేశ సంస్కృతీ, జాతీయ వికాసం మాలోనే వుంది...మేమే భారతదేశ వైభవ కర్తలం. మేమే కళలను పెంపొందిస్తాము. మా వాస్తవస్థితిని పవిత్రంగా అర్థంచేసుకున్న వారిని మే మెన్నడూ మోసగించము...మేము – ప్రేమ సౌభ్రాతృత్వాలను బోధించే ప్రచారకులం. ద్వేషం, అసహనం అంటే మాకు విరోధం...అందుకే మేమంతా కలసిమెలసి వుంటాం." అన్న ప్రతిధ్వనులు పంటచేల గుండెలలోంచి కాశీనాథ్‌కు ప్రతి ఉషస్సులోనూ వినిపిస్తుంటాయి.

కాశీనాథ్ వయస్సు సుమారు అరవై సంవత్సరాలు. ఇంతటి సుదీర్ఘ కాలంలో యేఒక్కరోజైనా కష్టం చేయకుండా తప్పించుకుని తిరిగిన సంఘటన అతని జీవితంలోలేదు. పంట భూములనుచూసి, పరవశంతో చెమరించిపోని ఋతువు లేదు. కొత్త బ్రతుకు గడప తొక్కుతున్నట్టు భావించని రోజు లేదు. ప్రేమ భరితమైన సౌఖ్య సందేశం వింటూ పొలంనుంచి యింటికివచ్చి, సుఖంగా నిద్రించని రాత్రి లేదు...జీవితకాలంతోటి మానవుల మోసానికి ఎన్నోసార్లు గురి ఆయినప్పటికీ, పంటభూములు మాత్రం యేనాడూ కాశీనాథ్‌ని మోసం చేయలేదు. పైపెచ్చు, మానవుల వంచనతో బాధపడే మనస్సును భూమాత కరుణాదరాలతో సేద దీరుస్తూండేది.

తనభూముల ప్రక్కనుండే భూములు, పోషణలేక వడిలిపోతుంటే, కాశీనాథ్ గుండె కన్నీటిని కార్చేది. అవికూడా

పచ్చగా రెపరెపలాడుతూంటేనే అతనికి పండగగా వుంటుంది. భూములన్నీ శ్యామలంగా వుండాలనీ, జీవన సంగీత తరంగాలు రేకెత్తాలనీ అతనెప్పుడూ భగవత్ప్రార్థన చేసేవాడు పచ్చని ధాన్యం మొక్కలు భవిష్యత్తులో రాల్చే బంగారు రాసులని మనోనేత్రం ముందు చూస్తూ, కారుచీకటిలోకూడా కాంతి రేఖలను సృష్టించుకొని, ఆత్మవిశ్వాస బలంతో ఆనందపథంవైపు పురోగమిస్తూ కాశీనాథ్ ప్రపంచాన్నే మరిచి గంటలతరబడి కాలం గడిపేవాడు.

రాయపూర్ గ్రామం గోదావరి నది ఒడ్డున వుంది. సుమారు అయిదువేల మంది జనాభా ఆ గ్రామంలో నివసిస్తూంటారు. గోదావరి ఉధృతమైన వరదలు చాలాసార్లు 'రాయపూర్'ని ముంచెత్తి నష్టపరిచినవి. కాని శ్రమజీవులైన రైతులు, ధైర్యం కోల్పోకుండా, తిరిగి అక్కడే నివసిస్తూ వ్యవసాయం చేస్తూండేవారు. వరదలవల్ల తాత్కాలిక నష్టం అనుభవించినప్పటికీ అనంతరం వారి భూములన్నీ సారవంతమైన ఒండు మట్టితో బంగారం పొంగుతూండేవి. రైతులు రాయపురం వదిలిపెట్టలేదు. రాయపురం వాళ్ళని పోనివ్వదు. ఇలా తరతరాలుగా జరుగుతోంది. ఏ తరంలోనైనా అక్కడి నేల బంగారమే. దుఃఖం సుఖాన్నీ, నష్టం లాభాన్నీ కలుగజేసే తత్వం వాళ్ళకి బాగా అలవాటైపోయింది.

కాశీనాథ్ రాయపురంలో అనాదినుంచీ నివసించే రైతు కుటుంబానికి చెందినవాడు పదిహేనెకరాల సుక్షేత్రానికి అధిపతి. పంటలు పండించడంలో నిధి. కష్టపడకుండా గట్టుమీద కూర్చొని పాలేళ్ళని కూకలేసి పనిచేయించే రకం కాదు. తను దమ్ములో దిగి, తను పిలవకుండానే తనతోపాటు అంతా వచ్చి పాల్గొనేట్టుచేసే ఆదర్శ శ్రమజీవి. ఏ కాలంలో, యే భూమిలో యెలాంటి పైరు వేయటమో, యే భూమిని యెలా పంటకు తిప్పాలో, ఇలాంటివన్నీ అతనికి అనుభవం పుష్కలంగా నేర్పింది అనుభవం అడుగుజాడల్లోపడి, అందరికన్నా అధనంగా పంటను పొందుతూ, అన్నిపనులూ అనుకున్న కాలంలోనే పూర్తి చేసుకుంటూ అవసరమైనంత విశ్రాంతినీ, ఆనందాన్నీ అనుభవిస్తూంటాడు కాశీనాథ్. ఇతని వ్యవసాయం, పంటల కీలకాన్ని గుర్తించని ధనవంతులు, భూమి సారాన్నే దృష్టిలో వుంచుకొని, ఇతని భూమిని క్రయం చేయటానికి చాలాసార్లు యత్నం చేశారు. కాని కాశీనాథ్ ఒక్క సెంటు కూడా విక్రయించేది లేదనీ నిర్మొగమాటంగా చెప్పేవాడు. అత్యధిక మూల్యం ఆశలకు లొంగి, అన్నపూర్ణను అమ్ముకోవటం అసహ్యాకరం అని అతను అందరికీ బోధిస్తూండేవాడు. పిల్లల చదువుకూ, సంసారానికీ అప్పుడప్పుడు వ్యయం అధికమవుతూన్నా, దాన్ని

యుక్తితో సహనంతో భరిస్తూ కలకలలాడే పొలాన్ని చూసి, అంతా మరిచిపోతూంటాడు. అంతగా మరీ ప్రాణం మీదకు వచ్చే అవసరాలేమన్నా తటస్థిస్తే, తన భూమిని చూపెట్టి ప్రభుత్వంవద్దనే అంతో యింతో అప్పుచ్చుకొని అవసరం గడుపుకోవడం, తరువాత, క్రమంగా ఒకటి రెండు నిర్ణీత వాయిదాలలో దానిని చెల్లించివేయటంతప్ప, ప్రైవేటు వడ్డీ వ్యాపారస్థులనుండి ఋణం తేవటమన్నది కాశీనాధ్ జీవితచరిత్రలో లేదు.

దేశం స్వతంత్రమైన తరువాత కాశీనాథ్‌లో చాలా పరివర్తన కలిగింది. ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల దయాదాక్షిణ్యాలపై ఆధార పడకుండా రైతుల వ్యవసాయం ప్రభుత్వం అండ దండలతో కొనసాగుతుందన్న విశ్వాసం అతనిలో ప్రబలంగా నాటుకుంది. రైతుల అవసరాలకు ప్రభుత్వం కల్పించిన ఋణసౌకర్యాల విషయం, వాటి వినియోగ పద్ధతులూ ఒకరు చెప్పకుండానే అతనే స్వయంగా తెలుసుకొని, అంతతో తృప్తిపడక పదిమందికీ తెలియ చేయందే నిద్రపోయేవాడు కాదు. ఇది ప్రజల కోసం, ప్రజలు స్థాపించుకున్న ప్రభుత్వమనీ, ముఖ్యంగా రైతు జనం, రైతు పొలం పట్లనే దేశం ఆధారపడి జీవిస్తున్నదని గుర్తించిన వారు నడిపే ప్రభుత్వమనీ, ఈ తరుణంలో ప్రైవేట్ వడ్డీ వ్యాపారస్థులకు భూములు తాకట్టు పెట్టవలసిన దుస్థితికి రైతులు లోనుకారాదనీ, జమీందార్ల, జాగీర్దార్ల స్వేచ్ఛా ప్రవృత్తి ఇక రైతుల జీవితాలను బాధించదనీ కాశీనాధ్ తను విశ్వసించి, ఇతరులకు విశ్వాసాన్ని పురికొల్పుతూ వుంటాడు.

రైతులు తాము కన్న కలలను యదార్ధం చేసుకోవటానికి ఇది స్వర్ణయుగం లాంటిది ఒకరి దయ, ఒకరి భయం రైతుకు అనవసరం ... రైతులు కోరిన ఋణం, యెరువులూ, విత్తనాలూ, పరికరాలూ అన్ని రూపాలలోనూ అందించడానికి ప్రభుత్వం యేర్పాటు చేస్తూన్నప్పుడు, రైతుకు సరాసరి ప్రభుత్వంతోనే తప్ప దోపిడీ దళారీలతో సంబంధం అవసరంలేదు. ఇత్యాదులు కాశీనాథ్ భావాలు. కష్టపడి పనిచేసేవాడు — యీ సౌకర్యాలతో కష్టాన్ని మరిచే సుఖం పొందవచ్చుననీ, సోమరితనంగా జీవించాలనుకుంటే ఈ సౌకర్యాలే విషంగా మారతాయనీ, అనుకుంటాడు కాశీనాథ్...అతనికున్నదల్లా ఒక్కటే వాంఛ. అది—ఒక్కసారి యావద్భారత దేశం తిరిగి, విశేషాలూ, వింతలూ చూసి రావాలన్నదే— వివిధ భాషలు మాట్లాడే ఈ విశాల భూఖండంలో, ఏ ప్రాంతం రైతు ఎలా వ్యవసాయం చేస్తున్నాడో చూసి, తెలుసుకొని ఆనందించాలని కాశీనాథ్ గాఢంగా అనుకుంటుంటాడు—ఈ కోర్కె పూర్తిఅయ్యే శుభసమయం త్వరలో రాబోతోందని

ప్రస్తుతం అతను ఉవ్విళ్లూరుతున్నాడు. దీనికి గల కారణం, పెద్దకొడుకు ప్రసాద్ మీద అతను పెట్టుకున్న ఆశలు. ప్రసాద్ పట్నంలో ఎం. ఏ. పరీక్షకు చదివి పాసై, యింటికి తిరిగి వస్తున్నాడు. రేపే వస్తా డనీ స్టేషన్‌కు మనిషినీ, బండినీ పంప మనీ ఇప్పటికి మూడు రోజుల క్రితమే వుత్తరం వచ్చింది.

పెద్దబ్బాయి ప్రసాద్ వస్తున్నాడన్న వార్త కాశీనాథ్‌ను ఏనుగెక్కించింది. ఒక్కసారిగా లక్ష ఆలోచనలు అతని బుర్రలో గిర్రున తిరిగినయ్. "ప్రసాద్ చదువు పూర్తిఅయింది. భగవంతుడు కరుణించి తనను గట్టెక్కించి విజయం చేకూర్చాడు. యిక ప్రసాద్ తనస్థానంలో నిలబడి వుంటే తను హాయిగా భారత దేశ యాత్ర చేయవచ్చు నిశ్చితంగా... తమ్ముడూ, చెల్లెండ్ల చదువును గురించిన శ్రద్ధ ప్రసాద్‌కు బాగా వుంది. భయం లేదు...భవిష్యత్తు సుఖమయం" అని కాశీనాథ్ ఎంతో సంబర పడ్డాడు.

కాశీనాథ్ బుర్రలో ఆనందం తెరలు తెరలుగా పరుచుకొని, ఆలోచనలు అనంతమైన పూలతీగెలుగా అల్లుకు పోతూండగా, తిన్నగా రైలుస్టేషనుకు కాలినడకనే బయలుదేరాడు. ఒక విధ మైన గర్వం అతని యెదలో సుడులు తిరిగిపోతోంది. ఎం. ఏ. పాసైన ఒకా నొక రైతు యువకునికి తాను తండ్రి నన్న భావం దానికి మూలం. శాస్త్రీయ



పద్ధతిలో వ్యవసాయ వ్యవహారాలు నిర్వ హించడానికి యీ రోజుల్లో చదువుకున్న యువకులంతా కృషి చేస్తే రైతుల దరిద్రం సగం తీరిపోతుందనీ, ప్రసాద్ తన వ్యవసాయాన్ని ద్విగుణీకృతం చేసుకోగల బుద్ధిమంతుడనీ కాశీనాథ్ ఆలోచిస్తున్నాడు.

ఆలోచనలతో నడిచినట్టే లేదు. అర్థ గంటలో రైలుస్టేషన్ రానేవచ్చింది. కాని, రైలుకింకా అరగంట ఆలస్యం వుండటంతో మళ్ళీ ఆలోచనలలో మునిగి పోయాడు. ఎంతసేపూ వ్యవసాయం, అభివృద్ధి, భారత దర్శన యాత్రా కుతూ హలం తప్ప, మరొకటి లేదు. అల్లంత దూరాన రైలుకేక వినపడ్డంతో కాశీనాథ్

బాహ్యప్రపంచంలో పడి, గబ గబ ప్లాటు ఫారం టికెట్ పుచ్చుకొని, ప్లాటుఫారం మీదికి వచ్చేశాడు రైలుకూత ధ్వని కాశీనాథ్‌కు మృదుల సంగీతంలా విని పిస్తోంది. యీ రైల్లోనే తన పెద్దకొడుకు, తన రక్తంలో రక్తం, తన గుండెలమీద పెరిగి పెద్దవాడైన ప్రసాద్ వస్తు న్నాడు...కలకలలాడే తన పంట పొలా లకు భవిష్యాధిపతి విచ్చేస్తున్నాడు...

రైలు వచ్చి ఆగింది. ఒక రెండవ తరగతి పెట్టెలో ఒకచేత్తో కడ్డీని పట్టుకొని రెండవచేత్తో చిక్కని జుట్టుని సవరించు కుంటూ సూటు ధరించివున్న ప్రసాద్‌ను చూసి, కాశీనాథ్ కొంచెం విస్తుపోయాడు. కాని అది ఒక క్షణం లోనే అంతరించి, ఒక్కసారిగా గుండెలు పులకరించి, ప్లాటుఫారం మీద అడుగు పెడుతూన్న ప్రసాద్ దగ్గరకు వెళ్ళి ప్రేమతో గాఢంగా కౌగలించుకున్నాడు. తండ్రి స్వయంగా బయలుదేరి స్టేషన్‌కు రావటం ప్రసాద్‌కు ఆశ్చర్య సంతోషాలు కలుగజేసింది. ఒక్కసారిగా తండ్రిని మళ్ళీ కౌగలించుకొని, నమస్కారం చేశాడు.

"మీరు శ్రమపడి ఎందుకు వచ్చారు నాన్నా? ఒక్క అరగంటలో నేనే వస్తూంటినిగదా?" అన్నాడు ప్రసాద్.

"ఆఁ, ఇంటివద్ద వుండి చేసే పని కూడా అంతకన్నా కనపళ్ళేదు. ఏదో అలా బయలుదేరాను.'' అన్నాడు కాశీనాథ్.

"అమ్మ కులాసాగా తిరుగుతోందా నాన్నా! ..రమేశ్ పాసైనాడనుకుంటాను. చెల్లాయిలు, లీల, శోభ బడికి వెళు తున్నారా? పక్కింటి రామయ్యగారి కుటుంబం కులాసాగా వున్నారా?''

ఇలా తండ్రిపైన ప్రశ్నల వర్షం ఒకేసారి కురిపించాడు ప్రసాద్. కాశీనాథ్ అన్నిటికీ ఆనందంతో ప్రత్యుత్తరం యిస్తూ కొడుకు ముఖాన్ని పరకాయించి చూస్తున్నాడు. మరింకేమన్నా ప్రశ్నిస్తాడేమోనని... ప్రసాద్ సామాన్లు లెక్కపెట్టుకొని తనిఖీ చూసుకోటంలో నిమగ్నుడైనాడు.

కాశీనాథ్ కొంచెం నిరుత్సాహపడ్డాడు. కొద్దిగా బాధకూడా ముఖంలో ద్యోతక మైంది...రైతు యువకుడు_ కొన్ని మాసాలుగా ఇల్లు వదిలి, తిరిగి వస్తున్న ప్పుడు అన్నిటికన్నా ముందు, పొలం గురించీ, పంట గురించీ, పశువులూ, వ్యవసాయం గురించీ తెలుసుకొని తరు వాతనే తల్లీ తమ్ముళ్ళ కుశలాన్ని విచా రించాలి కాని ఇంతసేపైనా ఆ సమా చారం గురించి ప్రశ్నించదేమా అన్న చింత ఆ పితృహృదయంలో తక్షణం నాటుకుంది...అయినా కాశీనాథ్ సంబా ళించుకొని "కుర్రతనం ... అన్నీ వాటంతటవే అర్థమౌతాయిలే'' అని తృప్తిపడ్డాడు.

''నీకోసం యింట్లో అంతా యెదురు చూస్తాంటారు. త్వరగా వెడదాం పద'' అన్నాడు కొడుకుతో. ఇద్దరూ ప్లాట్ ఫారందాటి కూలీతో సహా బయటికి వచ్చారు.

కూలీని సరాసరి ఇంటికి వెళ్ళి సామానులు దింపవలసిందిగా చెప్పి, కొడుకు ముఖంవేపు చూశాడు తండ్రి.

''అదేమిటి నాన్నా ' మనం కూడా కలిసే వెడుతున్నాంగా ?'' ప్రసాద్ అన్నాడు.

''అతణ్ణి వెళ్ళనీ...మనం, యిలా బయల్దేరి, గట్లమీదుగా మన పొలం చూసుకుంటూ అడ్డంగా వెడదాం,''

''ముందు యింటికెళ్ళి, అమ్మా వాళ్ళందర్నీ చూసి, సాయంత్రం పొలాలకి తీరిగ్గా వెళ్ళవచ్చు నాన్నా! అవేమన్నా పారిపోతాయా?'' అన్నాడు ప్రసాద్ తొందరగా.

''ఏమో! నీ ఆత్రంగాని, యిల్లుమాత్రం పారిపోతుందట్రా? కూలీకంటే ఒక పావుగంట ఆలస్యంగానేగా మనం వెళ్ళేది...? ఫరవాలేదు. రైతుకుర్రాడివి, దారికి సమీపంలోవున్న స్వంతభూములను చూడకుండా పోవటం బావుండదు. కన్న తల్లి ఆశీర్వచనం ఎన్నడూ వుంటుందిరా! కాని, భూమాత దయ పొందటం ముఖ్యం...ఆవిడ ఆగ్రహిస్తే అన్నం వుండదు. ఇదంతా భూమితల్లి కరుణే'' అన్నాడు కాశీనాథ్, మందమైన నిశ్చిత స్వరంతో. ఆయన కొడుకు సమాధానాన్ని నిరీక్షించకుండానే చేలకడ్డంగా పడిపోయే కాలిదోవకు మళ్ళాడు. ఇంకా తండ్రి మాటను తీసివేసి కాదనేంత అగౌరవ స్థితికి అలవాటుపడని ప్రసాద్ మారు మాటాడకుండా తండ్రిని అనుసరించాడు. కూలీ సామాన్లు నెత్తిన బెట్టుకొని, రోడ్డువెపు వెళ్ళిపోయాడు.

ప్రసాద్ యిష్టపూర్వకంగా కాక, బలవంతంగా తనవెంట వస్తున్నాడన్న భావం కాశీనాథ్‌కు క్షణకాలంపాటు కలిగినా, మరుక్షణంలోనే అది అదృశ్య మైపోయింది. తనంతవాడైన కొడుకుతో ఇలా పంటపొలాల మధ్య వుండటం అతనికో అపూర్వానుభవంగా వుంది. తన ప్రతిరూపమే తనతో తిరుగు తున్నట్టూ, పంటచేలు తనని ఆహ్వానించి సంగీతం పాడినట్లే తన ప్రతిరూపాన్ని కూడా ఆహ్వానిస్తున్నట్లూ కళ్ళముందు దృశ్యాలు తిరుగుతున్నాయి. మోయలేని సంతోషభారంతో స్వంతభూముల మధ్యకి ప్రవేశించాడు కొడుకుతో.

''ఈ భూములు నీకోసం ఎదురు చూస్తున్నవి బాబూ! వృద్ధుడు మమ్మల్నిక సంరక్షించలేడనీ, ఉత్సాహవంతుడైన యువకుడు యీ బాధ్యత తీసుకుంటే తృప్తిపడతామనీ అంటున్నాయి బాబూ! నిజంగానే నేను వీటి యోగక్షేమాలను సరిచూసే స్థితిలో లేను...నాకూ వీటికీ కూడా నీ చేయూత అవసరం'' అన్నాడు

కాశీనాథ్ ఆర్ద్ర్ర హృదయంతో పొలాల వైపు చూస్తూ.

ప్రసాద్ కొద్దిగా సంశయంతో తండ్రిని పరికించి, "మీ రనుకున్నంత వృద్ధాప్యం మీకింకా రాలేదు నాన్నా! మన భూము లైనా, ఇరవై నాలుగ్గంటలూ దగ్గరుండి చూస్తేనే పండేరకం కాదు...యిక మన పాలేళ్ళు కూడా అసలు సోమరిపోతులు కారని నా విశ్వాసం. అలాంటప్పుడు ఇవన్నీ యిప్పుడే ఆలోచించుకోవలసిన అవసరం లేదనుకుంటాను." అన్నాడు

కాశీనాధ్ ఈ ప్రత్యుత్తరంతో కొంచెం దెబ్బతిన్నట్టయి, సముదాయించుకున్నాడు. "లేదు బాబూ! యాభై ఏళ్ళు మించి పోయాయి యీ కండలలో వెనుకటి జవసత్వాలు లేవు...ఎంతటి సారవంతమైన వనరులున్న భూమి చెక్కయినా ఇరవైనాలుగ్గంటలూ శ్రద్ధతీసుకోనిదే, శ్రమచేయందే ఈ స్థితిలో వుండదు...పాలేళ్ళు స్వయంగా సోమరిపోతులు కారు కాని, రౌతు కొద్దీ గుర్రం నాయనా! తన భూమిలో ఎలా వ్యవసాయం చేయాలో తెలియని యజమానిపట్ల పాలేళ్లకు విధేయత వుండదు. మనం పనిచేస్తూ వారి చేత చేయించాలి. మనం, వాళ్ళూ కలిసి, అంతా తిండికోసం పని చేసుకుంటున్నా మన్న భావం కలిగితేనే వాళ్ళు వళ్ళు వంచి, ఉత్సాహంతో శ్రమపడి బంగారం పండిస్తారు...కాని మనం పడక కుర్చీలో కూర్చొని, కేవలం వాళ్లతోనే ఆజ్ఞల ద్వారా పని చేయిస్తుంటే, వాళ్లల్లో తాము తక్కువ వాళ్లమనే భావం, మనం కామందులమనే భావం కలిగి, ముదిరి పోయి, చాలా అనర్థాలకు తోవతీస్తుంది... అది చాలా తప్పు...కష్టంలో రైతు, పాలేరు, పశువు అంతా సమాన భాగ స్వాములే బాబూ! నీకింకా కుర్రతనం... ఇంకా చాలా వివరాలు తెలుసుకోవాలి నీవు."

ఏక బిగిన సాగిన తండ్రి మాటలు ప్రసాద్‌కు దిమ్మెత్తించి నట్లయింది. తన భవిష్యత్తు కాంతివంతంగా కాక, చీకటి ముసుగు ధరించ బోతున్నట్లు అతనికి అనుమానం కలిగింది. అస్పష్ట మైన స్వరంతో ఇలా అన్నాడు. "నిజమే నాన్నా! మరి నేను ఎం.ఏ. వరకు చదివిన ఉన్నత విద్యకు ఫలితం యేముంటుంది? నేను ఏదో ఉద్యోగం చేసి, గొప్ప వాణ్ణి అవడానికి కాకపోతే, నా చదువు మీద అనవసరంగా వేలాది రూపాయలు పెట్టుబడి యెందుకు పెట్టాలి? నాకు వ్యవసాయం గురించిన ఆసక్తి లేదని కాదు కాని, అంత కన్నా అధికంగా ఉద్యోగం చెయ్యాలనివుంది... సంపాదన దృష్ట్యా చూసినా, గౌరవం దృష్ట్యాచూసినా, చదివిన చదువును బట్టి అయినా ఉద్యోగమే లాభదాయకం అనిపిస్తున్నది నాన్నా?"

కాశీనాథ్ నిర్ఘాంతపోయి, కొడుకును ఆపాదమస్తకం పరిశీలించాడు. "ఉద్యోగం చేయటం చెడ్డ విషయమని నా అభిప్రాయం కాదు. కాని, అంతా ఉద్యోగాలు చేసేవాళ్లే అయితే వూళ్ళల్లో వుండి వ్యవసాయం చేసే వాళ్లెవరని నా సందేహం! దేశంలో చదువుకునే వాళ్ల సంఖ్య యే యేటి కాయేడు, కోట్ల సంఖ్యలో పెరిగి పోతోందికదా? మరి చదువుకున్న ప్రతి వాడికీ ఒక ఉద్యోగం కావాలంటే, అన్ని వుద్యోగాలు ఎక్కణ్ణించి పుట్టుక వస్తాయంటావు? నా అభిప్రాయంలో చదువుకూ ఉద్యోగానికీ లంకె లేదు. చదువు మనిషికి విజ్ఞానం ప్రసాదిస్తుంది. దాన్ని యే రంగంలోనైనా ఉపయోగించుకోవచ్చు. విజ్ఞానం కలవాడికీ, విజ్ఞానం లేనివాడికీ చాలా తేడా వుంటుంది. చదువుకున్నవాడు స్వధర్మాన్ని పోషించాలి ఉద్యోగం చెయ్యవలసింది ఎలాంటి భూవసతీ, జీవనోపాధులూ లేనివారు. కాని భూములున్న రైతులూ ఉద్యోగాలలో ప్రవేశిస్తే, ఇటు పంటల దిగుబడి తగ్గడమేకాక, బస్తీలలో ఉద్యోగాలు కూడా పేద వారికీ, తెలివిగలవారికీ లభించవు - క్రమంగా అంతా సోమరులూ, నిరుద్యోగులూ అవుతారు. పరాన్నభుక్కులవుతారు. మనం రైతులం— మన జీవనాధారం వ్యవసాయం. మన సమస్యల కిదే పరిష్కారం. మనలో చదువు



డాక్టరు: ఏమండీ మిమ్మల్ని రోజుకు నాలుగు చుట్టలకంటే ఎక్కువ కాల్చవద్దని చెప్తే, రోజుకు ఇరవైదాకా కాలుస్తున్నారటగా

పేషెంట్: అవునండి. నేను ఐదుగురు డాక్టర్లను కలుసుకున్నాను. ఐదుగురూ పై విధంగానే చెప్పారు అందరిమాట పాటిస్తున్నా

కున్న వాళ్ళు ఉద్యోగాలకు వెళ్ళి బస్తీ బాబులైపోయాక, చెడిపోయిన సంసారాలనూ, విరిగి ముక్కలైన కుటుంబాలనూ ఒక వైపు నీవు చూస్తూనే వున్నావు. వాళ్లని చూస్తూంటే యిప్పుడు జాలి వేస్తుంది. ఇంతటి స్వతంత్ర జీవనం, సుఖం, ఉద్యోగంలో వుంటాయంటే నేను నమ్మను. తెలిసిన వాడివి...ఆలోచించుకో! యీ భూములు

మన ప్రాణాలు...వీటిని నిర్లక్ష్యం చేయకూడదు''

"లేదు నాన్నా ! మీరెంతైనా చెప్పండి! కాదనను...వ్యవసాయంలో ఒకవిధమైన స్వతంత్రం వున్నమాట వాస్తవమే... కాని చదువుకున్నవాడు వ్యవసాయం చేయడం లాభదాయకం కాదు ముఖ్యంగా నాలాంటి వాడికిది లజ్జాకరం కూడాను'' అన్నాడు ప్రసాద్ భయపడుతూనే ఖండితంగా.

కాశీనాథ్ షాక్ తిన్నట్లయి పోయాడు తన కొడుకు నుంచి, ఇలాంటి సమాధానం తను ఆశించిందికాదు. అతని పెదవులు కొద్దిగా చలించినవి క్రింది పెదవిని మునిపంటితో నొక్కుతూ "ఐతే, వ్యవసాయం చేసుకునే వాళ్లంతా సిగ్గులేని మూర్ఖులని నీభావం...! అంతేనా ? తమ పుత్రులు బాధ్యతలను విస్మరించి, బ్రతకడానికి పనికిరాని వాళ్ళు కావాలనేనా తండ్రులు వారికి విద్యాబుద్ధులు చెప్పించేది...? తల్లి దండ్రులు రక్తం ఓడ్చి సంపాదించిందంతా దర్జాగా తింటూ అనుభవించటానికేనా పుత్రులని చదివించేది...? కన్న తల్లి దండ్రుల్నీ, పెంచి పెద్దజేసి అభివృద్ధికి కారణమైన భూమితల్లి నీ గంగలో ముంచటమేనా పుత్రుల కర్తవ్యం ? ఇదే నిజమైతే బుద్ధిగల వాడెవ్వడూ తన సంతానాన్ని మరిచిపోయి కూడా చదివించడు...ఆలోచించుకో బాబూ ! త్వరపడి ఒక నిర్ణయానికి రాబోకు...యువకుడివి. ఏం.ఏ. చదివావు...చుట్టుపట్ల నాలుగైదు పల్లెలలో చదువుగల రైతు లేడు...నీతెలివితో వ్యవసాయం ద్విగుణీకృతంగా అభివృద్ధి చేసుకోవచ్చు - స్వల్ప పరిశ్రమతో, అధిక ఫలితం అనుభవింప జేయటానికి సర్వదా సిద్ధంగా వుండే భూతత్వాన్ని పరిశోధించి, బంగారం పండించుకోవచ్చు. చదువు దండగ కాదు." అన్నాడు కాశీనాథ్

ప్రసాద్ నిర్లిప్తంగా పాంటు జేబుల్లో రెండుచేతులూ దోపుకుని, తండ్రిమాటలు వింటున్నాడు.

"మరొక విషయం ప్రసాద్! నీ కోరికలకూ, నీ చదువులకూ ఖర్చుపెట్టడం యిక సాధ్యంకాదు రమేశ్‌నికూడా చదివించాలి. వాడు చదువుకుంటూనే పొలం పని చూసుకుంటాడు అతన్నికూడా నీలాగే చదివించాలికదా? చదివాక తీరా అతనుకూడా నీలానే వ్యవసాయం చేయనంటే, యీ భూమీ, సంసారం, యిల్లూ వాకిలీ, యేం కావాలంటావు...? బ్రతికి నన్నాళ్ళూ కష్టపడేంత ఓపిక యిక యీ ముసలాడికి వుండదు ... విశ్రాంతి తీసుకోవాలి ... యేదో ఒక మార్పు అవసరం అవుతుంది...మా ముసలాళ్ళచేత అస్తమానం చాకిరీ చేయించటం, మీ యువకులకు ఆనందం చేకూరుస్తుందా నాయనా! మాకు సుఖపడే అర్హతంటూ లేదా?" అంటూ యిక గద్గద కంఠంతో

మాట్లాడలేక కాశీనాథ్ గ్రామంవైపు తిరిగాడు. ప్రసాద్ తండ్రిని అనుసరిస్తూ ఆలోచిస్తున్నాడీ హఠాత్సంచలనం గురించి.

ఇంటిముందు తల్లి నిలబడి కొడుకు కోసం ఎదురు చూస్తోంది. ప్రసాద్ తల్లికి పాదాభివందనం చేశాడు. తల్లి ఆప్యాయతతో కొడుకును కౌగలించుకొని తల నిమిరింది "బాబు కొంచెం చిక్కిపోయాడు కదండీ!" అంది భర్తతో 'అవునేమో' అన్నట్లుగా చూస్తూ నిలబడ్డాడు తండ్రి.. చెల్లెళ్లు లీల, శోభ, తమ్ముడు రమేశ్, అంతా వరసగా ప్రసాద్‌ని కౌగలించుకొని, లోపలికి తీసికెళ్ళారు.

పట్నంలో చదివే ప్రసాద్‌కు ప్రతి నెలా నూటయాభై రూపాయిలు పంపుతుండేవాడు తండ్రి ... వాటిని ఖర్చు పెట్టుకుంటూ తృప్తిగా పట్నంలో సంవత్సరాల తరబడి కాలం గడిపిన ప్రసాద్, దాదాపుగా తను రైతు నన్న మాటనే మరిచిపోయాడు. ఇరవై ఒక్క సంవత్సరం దాటింది. తన మంచి చెడ్డలు తను చూచుకోగలన్న విశ్వాసం అతనిలో ప్రబలంగా వుంది ..ఎలాగైనా ఉద్యోగం చెయ్యాలన్నదే అతను పెంపొందించుకున్న అభిలాష ... దీనికి విరుద్ధంగా తండ్రి మాట్లాడినతీరు చూస్తే గుండెల్లో రాయి పడ్డట్టయింది ... "అసలు తనెందుకూ చదివింది? ఈ విషయం అమ్మతో చెప్పి, ఉద్యోగం చెయ్యాల్సిందే. కానప్పుడు తన చదువు అంతా వ్యర్థం... అర్థంలేని వట్టి దండుగ...పదిహేను సంవత్సరాలపాటు సాగిన శుష్కకాలయాపన."

ప్రసాద్ ఇలా ఊహాలలో కొట్టుకుంటూండగానే రోజులు దొర్లిపోతున్నాయి.

పట్నం వెళ్ళాలన్న ఉబలాటం, ఉద్యోగం సంపాదించి, అక్కడేవుండిపోవాలన్న ఆరాటం రోజులు గడిచిన కొద్దీ పెరిగిపోతున్నది. ఇంటినుంచి పట్నం వెళ్ళడానికీ, వుద్యోగం దొరికేదాక కాలక్షేపం చెయ్యడానికీ కొద్దిమొత్తమన్నా డబ్బు కావాలి ... తండ్రిని అడగడానికి ధైర్యం చాలదు ... అడిగినా ఇవ్వడు అన్న సంగతి తెలుసు. ఒకనాటి సాయంత్రం తీరిగ్గా వున్నప్పుడు, తల్లి దగ్గరికెళ్ళి, జాలిగా ముఖంపెట్టి అడిగాడు.

"నేను పట్నం వెళ్ళి ఉద్యోగం చెయ్యా లనుకుంటున్నా నమ్మా! నాకు కొద్దిగా డబ్బు కావాలి!" అన్నాడు. కొడుకు మాటలు విని తల్లి గుండెలు ఖేదపడ్డాయో లేదో కాని, ప్రేమపూరిత కంఠస్వరంతోనే ప్రత్యుత్తర మిచ్చింది.

"నీ పరిస్థితి క్లుప్తంగా మీ నాన్న చెప్పారు ... నీవు పెద్దవాడివి ... బాధ్యతల్ని అర్థంచేసుకోలేకపోతే సరేలే. కాని, కనీసం మీ నాన్న వృద్ధాప్య స్థితిని చూసి జాలికూడా రావడం లేదట్రా నీకు? నీవు రైతుబిడ్డవు...వ్యవసాయం

చూసుకోవడం నీ విధి. మాకింకా ఎంత కాలం యీ బాధ్యత...? భూమికలు విరిగేలా కృషి చేయందే భూమితల్లికి దయరాదు... అది లేనినాడు మనం యెక్కడ వుండేవాళ్ళమో ఆలోచించు. నీ అంతవాడు నీ తమ్ముడుకూడా కావాలి. అమ్మాయిలకూ్కడా అంతో యింతో చదువు చెప్పించాలి. ఇద్దరికీ పెళ్ళిళ్లు చేయాలి. మీ యిద్దరి పెళ్ళిళ్లూ కావాలి. వీటి కయ్యే అప్పులో సప్పులో తీర్చాలి. ఇంకా నిత్యకృత్యాలు...పాలేళ్లు ..పశువులు... దానాలు, ధర్మాలు...ఎన్ని? నీవు ఒక్కడివి ఎం. ఏ. చదివినంత మాత్రాన యివన్నీ పరిష్కారమైనట్లేనా? తరువాత నీ యిష్టం!" అంది తల్లి మృదువుగా మందలిస్తూ.


అనుకోకుండా యింట్లో వచ్చిన ఈ మార్పుకు ఆందోళన పడ్డాడు ప్రసాద్... కన్న తల్లి కూడా ఇలా కఠినంగా ప్రవర్తిస్తుందనుకోలేదు..తన ఆశయాలకు వీళ్ళంతా అవరోధంగా నిలబడ్డారని కోపం వచ్చింది...తీరేమార్గంలేక దుఃఖం వచ్చింది. తల్లి దండ్రుల అభిప్రాయాన్ని మార్చడానికి శక్తి లేదు. తన అభిప్రాయం మార్చుకోవడానికి యిష్టంలేదు. పరధ్యానంగా వుండటం, అప్పుడప్పుడు భోజనం మానెయ్యడం, చికాకు పడటం జరుగుతోంది. తల్లి శతవిధాలా చెప్పింది. ఆనాటినుంచి యింతవరకు తండ్రి మళ్ళీ యీ ప్రసక్తినే తేలేదు. ఫలితం? రోజు రోజుకూ చిక్కిపోవడం, పరధ్యానం అధికం కావడం.

కొడుకు స్థితిచూసి కాశీనాథ్‌కు చాలా కష్టం వేసింది...కాని చేసేదేమిటి? తను నిర్వర్తించాల్సిన బాధ్యతలు అన్నీ యింకా ముందే వున్నాయి వీటన్నిటినీ తానొక్కడే తట్టుకోగలడా? ఇదే ఆయన ఆలోచన.

ఒకనాడు కొడుకు గదిలోకి వచ్చాడు. ...తండ్రినిచూసి వినయంగా నిలబడ్డాడు ప్రసాద్—కాశీనాథ్ అతని వీపు మీద చేయివేసి నిమురుతూ నిలబడే వుండి ఇలా అన్నాడు.

"నీవు మమ్మల్నిలా ఖేదపరుస్తావని మేము అనుకోలేదురా!... చదువుకున్న కుర్రాళ్లు వ్యవసాయం చేయడానికెందుకు సిగ్గుపడాలో నాకు చచ్చినా అర్థంకాదు. యీ వ్యవసాయమే తమ చదువుకు ఆస్కారమైందన్న సంగతి వాళ్ళు మరచి పోతారెందుకో? తలిదండ్రులు తమని చదివించే కారణం వాళ్ళకి బోధపడదో, లేక బాధ్యతలంటే భయమో తెలీదుకాని, యిది చాలా విచారకరమైన పరిస్థితి బాబూ! నీవు బస్తీ బాబువి కాదల్చుకుంటే, ఉద్యోగమే చేయాలనుకుంటే, స్వేచ్ఛగా వెళ్ళు. నీ మనస్సును బంధించి పెత్తనం చేయడం నాకిష్టం లేదు. కాని అందులో నీకు సరిఅయిన విశ్రాంతి, సౌఖ్యం లభించవని మాత్రం గుర్తుంచుకో! ఆత్మ గౌరవం కలవ్యక్తికి

వ్యవసాయాన్నీ, స్వయంకృషిని మించిన ఉపాధిలేదు. ఇదుగో తీసుకో! ప్రస్తుతం రెండువందల రూపాయిలు మాత్రమే వున్నాయి. తీసికెళ్ళు. ఇక నయాపైసా సహాయంచేసే స్థితిలేదిక్కడ. ఇంటి నుంచి డబ్బు వస్తుందన్న ఆశ పెట్టుకో వద్దు...పిల్లలందరి చదువూ, పెండ్లిడ్లు, వ్యవసాయం, అన్నీ ఆలోచించుకోవాలి గదా? నీ చదువు ఇలా అయింది ... యిక వారి వెలా అవుతాయో? ఎలా అవుతుం దనుకున్నా బాధ్యత నెరవేర్చక తప్పదు మరి ... అసలు వాస్తవం నా కిప్పటికీ బుర్రబద్దలైనా అర్థంకావడం లేదు బాబూ! నీకు వ్యవసాయం అంటే ఎందు కింత చిన్న చూపు? ఎందుకింత అసహ్యం? మనిషి బ్రతుక్కి మార్గంచూపే పంట భూములూ, పల్లెటూళ్ళూ, జీవితంలో నిర్లక్ష్యం చేయదగినవి కావు. చదువు కున్న వాళ్ళంతా నీలానే పల్లెలు విడిచి, బస్తీలకి వలసపోతే ఇక పల్లెలు బాగయే దెప్పుడు? అసలు అప్పుడు పల్లెటూళ్లు వుండడమెలా? ఇక్కడి దరిద్రం తీరేమార్గం? ఇది ఇంత పెద్దగా చదువుకున్న నీవు ఆలోచించటం లేదంటే నేను చాలా సిగ్గుపడుతు న్నాను బాబూ! నీవు నా ఆశలను వ్యర్థం చేశావు'' కాశీనాధ్ రుద్ధ కంఠంతో మాట్లాడలేకపోయాడు. ఒక్కో వాక్యం ఒక్కో బాణంలా ప్రసాద్ గుండెలకు తాకుతోంది. కాని పట్టణవాసం కోర్కె



''ఒరే శ్రీపతీ! మీనాన్న సంక్రాంతికి ఏం తెచ్చాడ్రా? జబర్దస్తీగా వున్నావ్.. ''
''రెండు వందల రూపాయల అప్పు తెచ్చాడ్రా ''

విజృంభించిన గుండెలు, చేతిలో పడ్డ రెండు వందల రూపాయిలను వజ్ర కవచంలా చేసుకొని ఆ బాణాలను తట్టు కున్నాయి.

రెండువందల రూపాయలు పుచ్చుకొని పట్నం బయలుదేరాడు ప్రసాద్. కాని మనస్సు నిర్మలంగా, సంతోషంగా లేదు. యింటి పరిస్థితి కళ్ళముందు నటిస్తున్నది. తన తండ్రికూడా చదువు కుని, వ్రాయ నేర్చిన వాడే అయినా, పొలాల్లో పనిచేయటానికి సిగ్గు పడడు. అలా కష్టపడే తనని చదివించాడు. ఎప్పుడైనా యింటినుండి డబ్బురాక తను యిబ్బందిపడ్డ సంఘటన లేదు...

తనిప్పుడు తండ్రి అభిప్రాయానికి విరుద్ధంగా బస్తీ ఉద్యోగార్ధం బయలు దేరటం, ఆయన మనస్సును చాలా కష్ట పెట్టినమాట వాస్తవం. తను చేస్తున్నపని సబబైనదా కాదా? ఇదే ప్రశ్న అనుక్షణం ప్రసాద్ మనసులో మెదుల్తున్నది.

రైల్లో ప్రయాణంచేస్తూ కిటికీలోంచి బయటికి తలపెట్టి చూస్తుంటే ప్రక్క నుండి బాణాలవలె రివ్వున దూసుకు పోయే పంటచేలు తనని తిట్టిపోస్తూ వెళుతున్నట్లు అనిపించింది. కొన్ని చేలు తనకు హిత బోధ చేస్తున్నట్లుగా పంటతో ఒరిగి కనిపించేవి. అవి తనతో మాట్లాడు తున్నాయనిపించింది. "దేశంలో నూటికి ఎనభై వంతులజనాభా పల్లెటూళ్లలోనే వుండి వ్యవసాయం మీద బ్రతుకుతూ బస్తీ ప్రజల్ని బ్రతికిస్తున్నారు. దేశం లోని వర్తకం, పరిశ్రమలూ, వీరి శ్రమ, శక్తి సాధించిన ఉత్పత్తివల్లనే పెంపొందుతున్నాయి. చదువుకున్న ప్రతి వాడూ పట్నం ప్రయాణంకడితే ఇక పల్లెల్లో నూతన చైతన్యం ఎలా కలుగు తుంది...? నూతన పద్ధతిలో అధిక పంటలు పండించడం సాధ్యం అయ్యే దెలా?" అంటూన్నాయి చేలు

ప్రసాద్‌కు క్రమంగా బస్తీ దృశ్యాలు కనిపించటం ప్రారంభించినవి. విశాల మైన వీధుల్లో కూడా క్రిక్కిరిసి నడిచే జన సమూహం, హోటళ్లూ, కిళ్ళీ దుకాణాలముందూ, చెత్తడబ్బాల దగ్గర గుమి గూడి వుండే బిచ్చగాళ్ళ రొద, వుండ టానికి ఇళ్ళు దొరక్క పేవ్‌మెంట్ల ప్రక్కనే నెలల తరబడి నివాసం చేసే నిరాశ్రయజీవులు... హోటళ్ళలో పని చేసే సర్వర్లు, మిల్లుల్లో బండ చాకిరీ చేసి, ఇండ్లకు పోతూ, త్రోవలో సారా దుకాణాల ముందు తారట్లాడే నిరుపేద కార్మికులు, వందలాది, వేలాది నిర్భాగ్య జీవులు అంతా సినిమా చిత్రంలా కళ్లల్లో మెదిలారు. వీళ్ళతోపాటే, దుకాణాల్లో పట్టు పరుపుల నానుకూర్చొని వ్యాపారం నడిపించే బడా సేట్లు, హోట ళ్ళలో కౌంటర్లవద్ద కూర్చొని డబ్బులు దండుకునే యజమానులూ, బిచ్చగాళ్ళని విదిలించి నెట్టివేసే భీమ విగ్రహాలూ, పేవ్‌మెంట్లని ఖాళీ చేయించటానికి అవస్థపడే పోలీసు జవానులూ, కార్మికుల శక్తిని మ్రింగుతూ ఆవిరి రూపంలో వదిలే కర్మాగారాల పొగగొట్టాలూ, క్షణం విశ్రాంతి లేకుండా ఒకరితో ఒకరికి సంబంధం లేకుండా నడిచే మానవ జీవి తాలూ, అన్నీ కనిపిస్తున్నాయి. పల్లె టూళ్ళో వుండే తల్లి దండ్రులు పంపే డబ్బును జల్సాగా ఖర్చు పెడుతూ, మస్తుగా తిని, ముస్తాబై కాలేజీలకి వెళ్ళే పడుచు కుర్రాళ్ళూ, యువతులూ— అదంతా బస్తీలో ఒక ప్రత్యేక దృశ్యం... తను కూడా మొన్నటి వరకూ ఈ రకం మనిషే. కాని, ఇవాళ ఉద్యోగాన్ని

కోరే వ్యక్తి... విద్యార్థి కాడు... ఉద్యోగాభ్యర్థి......

తనేం ఉద్యోగం చేయాలి? అసలు ఉద్యోగం సాధించటం ఎలా? సందేహం కలిగింది ప్రసాద్‌కు...హఠాత్తుగా మరొక దృశ్యం గోచరించింది. కాలేజీకి వెళుతూ వచ్చే త్రోవలో మలుపుమీద వున్న పెద్ద ఆఫీసు...పెద్ద అక్షరాలతో వున్న బోర్డు..."ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజి కార్యాలయం" మనసులో స్పష్టంగా మెదిలింది. ప్రతి రోజూ అక్కడ క్యూలో నిలబడే జనాన్ని అప్పుడు యథాలాపంగా చూస్తూండే వాడు...ఇప్పుడు తనూ అక్కడికే వెళ్ళాలి...ప్రసాద్ గుండె గుభేలు మంది...అబ్బో! క్యూ...వందలు... వేలు...వీళ్ళందరికీ ఉద్యోగాలిచ్చే దెవరు? గవర్నమెంటా? గవర్నమెంటులో ఒక జిల్లాలో ఇన్ని వేల ఉద్యోగాలు రోజులతరబడి ఎలా క్రొత్తవి పుట్టుకొస్తుంటాయి...? ఏమో...అర్థం కాదు...తనలాంటి 'ఎం. ఏ.' పాసైన వాళ్ళు తనవూళ్ళో లేరు కాని, ఇక్కడ, ఈ సంవత్సరం తనతోపాటు చదివిన వాళ్ళే వందలమంది వున్నారే...తన లానే వారున్నూ...యింతమందీ నిజంగా నిరుద్యోగులై చేసే పనిలేకనే పల్లెలు విడిచి, పట్నాలకు బయలుదేరి – ఉద్యోగాలు వెతుక్కుంటున్నారా...? తనకు కూడా పల్లెలో పనిలేకనేనా వుద్యోగానికి బయలుదేరింది...? పట్టిది...కాదు. ఇదంతా డిగ్నిటీ ఫీలింగ్...చదువుకున్న వాండ్లమన్న సుపీరియారిటీ ... ఫాల్స్ ప్రిస్టేజి...సోమరితనం...కష్టపడట మంటే భయం. శరీరశ్రమ చేయకుండా నాలుగురాళ్ళు సంపాదించడమే అందరి ఆశయం. అందరికీ ఇదే భావం వున్నప్పుడు, దేశంలో చదువుకున్న వాళ్ళంతా ఉద్యోగం తప్ప మరో పనికి సిద్ధం కానప్పుడు ఇక ఎంప్లాయిమెంటు ఎక్స్ఛేంజిల ముందు వేలాది నిరుద్యోగులు గుమిగూడక యెలావుంటారు...? ఒకవేళ దొరికినా వీళ్ళందరికీ యేరకం ఉద్యోగాలు లభిస్తాయని...ఏమో...! ప్రసాద్ గుండెల్లో దేవినట్లయింది...ఒక్కసారి కళ్ళు తుడుచుకుని, శూన్యంలోకి చూశాడు...భూమీ ఆకాశం కలిసిపోయి, ఏటవాలుగా జారిన ప్రదేశంలో చూపు నిలిపాడు...అక్కడ శూన్యంలా కనపడలేదు...మసక మసకగా ఒక ఆజాను బాహు ఆకారం కనిపించింది. అది క్రమంగా నడుస్తూన్నది...ఒక్కక్షణం.. రెండు క్షణాల్లోనే తన కండ్లముందుకు వచ్చిందా ఆకారం...ఇప్పుడు బాగా పోల్చుకున్నాడు... అది తన తండ్రి ఆకారం...పైపంచె నడుముకు బిగించి, ధోవతీ మడిచికట్టి, పలుగూ పార భుజాన వేసుకొని, నెరసిన వెంట్రుకలు మాత్రం వృద్ధాప్యస్థితిని సూచించే విధంగా వుంది ఆకారం...ప్రసాద్ కళ్ళు మూతలు

పడ్డాయి...మళ్ళీ తెరిచాడు...,ఆకారం మాయమైపోయింది.

"శ్రమజీవి నిరంతరం శ్రమే కాని, సుఖం ఎరుగని కర్మజీవి..."అస్పష్టంగా ప్రసాద్ పెదవులు ధ్వనించినవి...ఆ మహానుభావుడు ఒక్కడూ జీవించలేక ఇంత కష్టపడుతున్నాడా......? ఎవరి కోసం...? కష్టాన్నే సుఖంగా ఊహించు కొని భవిష్యత్తును బంగారుకలగంటూ మురిసిపోతూ, ఎన్ని ఆశాసౌధాలు నిర్మించుకున్నాడో...! తనమీద ఎంత నమ్మకం వుంచుకున్నాడో......దానికి లభించిన ప్రతిఫలం...! విద్రోహం, తిరుగుబాటు...' అయినా రెండువందల రూపాయిలు తడుముకోకుండాయిచ్చాడు. ప్రసాద్ కండ్లలోంచి అప్రయత్నంగా రెండు కన్నీటి బిందువులు రాలి, రైలు వేగం గాలికి ఆహుతై ఆకాశంలో కలిసి పోయాయి. ఒక్కసారిగా ముఖం రెండు చేతులా కప్పుకున్నాడు. రైల్లోని తోటి ప్రయాణీకులు గమనించకుండా...అతని ముఖం వివర్ణమైపోయింది. రైలింజనులా ఘోషపెడుతున్నది ఆత్మ... "తిరిగి వెళ్ళు...యింటికే...తండ్రి కోరేది పుత్రుడి చెడు కాదు...ఉద్యోగం చేపడితే ఒక్కడివే బ్రతుకుతావు కాని, ఊళ్ళో వుండి చక్కగా వ్యవసాయం చేసు కుంటూ ఆదర్శవంతంగా జీవిస్తే పది వూళ్ళ ప్రజల సుఖమయ భవిష్యత్తుని నిర్మిస్తావు. ఇది నీ విధి...వెళ్ళు... తిరిగిపో!"

ఆత్మఘోష రైలుకన్నా అధికం అయింది. ఆలోచనలు అనంతం అయి నవి...పల్లెల్లో వుండే చదువుకున్న వాళ్ళంతా గుర్తు రాసాగారు. "కుందన్ పూర్"లో దేవానందశర్మ...డాక్టరీ ఉత్తీర్ణుడయ్యాడు. మంచి హస్తవాసిగల డాక్టరుగా పలుకుబడి వుంది. కాని పల్లెలోవుండి వ్యవసాయం చేస్తున్నాడు. డాక్టరీలోను, వ్యవసాయంలోనూ ప్రవీణు డనిపించుకుంటూనే వున్నాడు. ఆ గ్రామంలో వ్యాధులు అదృశ్యమై పోయినవని ప్రతీతి. ఆయన కన్నా తన ప్రావీణ్యం అధిక మేమిటి? పల్లెలో వుండడానికి తనెందుకు సిగ్గు పడాలి? తిండికి లేకుంటే ఉద్యోగం చెయ్యాలి. కాని తనే పదిమందికి తిండి పెట్టగల శక్తివంతుడైనప్పుడు తన కెందుకు ఉద్యోగం...? తల్లిదండ్రులనీ తోబుట్టువుల్నీ, అందర్నీ ధిక్కరించి, ఎందుకీ పరుగు? ఎక్కడికి వెళ్ళినా, ఏనాటికైనా,శాశ్వతంగా యిక్కడికే చేర వలసి వస్తుంది. ఉద్యోగం శాశ్వతం కాదు. ఉన్న వూరినే బస్తీగా, దాని తాతగా తీర్చి దిద్దుకోవడం ఎందుకు కుదరదు...? ఇన్నిటినీ మించి తన కోసం త్యాగం చేసే తల్లి దండ్రులను ప్రశాంతంగా సుఖపడనీయటం తన విధి...'' ప్రసాద్ మేధస్సులో పెద్ద

ప్రకంపనం బయలుదేరింది......అంతా అల్లకల్లోలం!

ఒక చిన్న స్టేషన్‌లో రైలు ఆగింది. పట్నం యింకా పదిమైళ్ళ దూరంలో వుంది. ప్రసాద్ చప్పున స్థిరమైన నిశ్చయానికి వచ్చేశాడు. తుఫాను చల్లబడ్డది అంతా ప్రశాంతం... గంభీరం...తన సామానుతోసహా ఆ స్టేషన్‌లో రైలుదిగాడు. రైలు ప్రసాద్ లేకుండానే పట్నం వెళ్ళిపోయింది. అటునుంచి వచ్చే రైలులో యెక్కి రాత్రి ఎనిమిది గంటలకి యింటికి చేరుకున్నాడు ప్రసాద్...ఇతని రాక తల్లీ తండ్రీ తోబుట్టులందరికీ ఆశ్చర్యం కలిగించింది.

"పట్నం వెళ్ళలేదా?" తండ్రి ముక్తసరిగా ప్రశ్నించాడు.

"క్షమించు నాన్నా! నేను పట్నం వెళ్ళను. ఉద్యోగం గురించిన ప్రశ్నే లేదిక. యింటి దగ్గరే వుండి, హాయిగా వ్యవసాయం చేసుకుంటూ నీకు తోడ్పడతాను...వాడికి అవసరమనుకుంటే, నా అంత చదువుకున్న తరువాత తమ్ముడు ఉద్యోగం చేస్తాడు. నాకు మాత్రం అవసరంలేదు.....త్వరపడ్డందుకు క్షమించమని ప్రార్థన" అంటూ తండ్రికి నమస్కారం చేశాడు ప్రసాద్. కాశీనాథ్ కొడుకులో కలిగిన హఠాత్పరిణామానికి ఆశ్చర్యపోయాడు ... పస్తాయించి చూశాడు.



"నాకు భయపడి, నాపట్ల గౌరవంతో మనస్సు మార్చుకున్నావా బాబూ! నిర్బంధంగా ఎదీ చేయలేము. జీవితాన్ని ఇరుకున వేసుకోరాదు" అన్నాడు.

"లేదు నాన్నా! స్వచ్ఛందంగానే మారిపోయాను. నాభవిష్యత్తును పూర్తిగా ఊహించుకున్నాను. యిక ఏనాడూ ఉద్యోగ ప్రశంసకు తావులేదు" అని రైలు చార్జీలు పోను జేబులోవున్న డబ్బుతీసి తండ్రి ముందుంచాడు. కాశీనాథ్ డబ్బు తీసి, తిరిగి కొడుకు జేబులోనే పెడుతూ, తన బలిష్ఠమైన బాహువుల్తో కొడుకుని కౌగలించుకుని ఆనందబాష్పాలురాలుస్తూ అన్నాడు

"నిజమైన రైతు బిడ్డవు తండ్రీ! సరియైన నిశ్చయానికి వచ్చావు. నీవు అచ్చంగా నాలాంటి వాడివేననీ, సోమరిపోతువు కావనీ నేను గట్టిగా ఆశిస్తూ వచ్చాను. అందుకే యింత చదువూ చెప్పించాను. నా శ్రమను దేవుడు వ్యర్థం చేయడన్నది నా గట్టి నమ్మకం...ఇదిగో! ఈ యింటికీ, సంసారానికీ, ఆస్తిపాస్తులన్నింటికీ, ఈ క్షణం నుంచీ నీవు యజమానివి...నీయిష్టం వచ్చిన పద్ధతిలో నిర్వహించుకోవచ్చు... మీ అభివృద్ధిని చూసి, ఆనందపడటం తప్ప నాకు యితర చింతలు లేవు. నీవు స్వచ్ఛమైన రైతు బిడ్డవు బాబూ!"

ప్రసాద్ తండ్రి కౌగిలిలో అలానే కరిగిపోయాడు...తల్లీ, తోబుట్టువులూ అంతా చుట్టూ మూగిపోయారు...కాశీనాథ్ హితబోధ చేస్తున్న వాడిలా అన్నాడు.

"ప్రతి రైతుబిడ్డ పెద్దచదువులు చదివి తీరాలంటాను. చదివేది, మన అనుభవాలను అభివృద్ధి చేసుకోవలసిన విజ్ఞానం కోసంకాని పదవులకోసం కాదు..మనిషిని సోమరితనంలోకి దింపటమే విద్యాలక్ష్యమనే మాటైతే, ఆ విద్యకో నమస్కారం...కనీసం, పక్షులూ, వృక్షాలూ, మృగాల స్వభావం, పేర్లను కూడా కనుక్కోలేని చదువులు సర్వదండగ...పల్లెటూళ్ళ వాళ్ళు పరమ మూర్ఖులనుకునే విద్యావంతులు 'చదువుకున్న మూర్ఖు' లంటాను...పల్లెల్లోనే దేశం బ్రతుకు వుందనీ, భూమిలోనే జీవం వుందనీ గుర్తించకుండా ఇవాళ్లా, రేపు చదువుకున్న రైతు కుర్రాళ్ళంతా బస్తీలలో ఉద్యోగాల కెగబడితే, యీ వరస యిలానే సాగితే, యీ ఒక్కతరంలోనే వ్యవసాయం దేశంలో అదృశ్యమై ముందు తరాలకు అంధకారం తప్ప మరేమీ మిగలదు. ఇతర దేశాలకన్నా ముందుకు పోవాలని, గొప్ప గొప్ప ప్రయోగాలూ, చదువులూ సాగించేమనం, అందరికన్నా క్రిందికే పోతాం...మన చదువులు వ్యవసాయంలో విప్లవం తేవాలి...నూతన అభివృద్ధికి దోహదం కావాలి. కొత్త పరిశోధనలను చదువుకున్న రైతులు ఆకళింపు చేసుకుని, పంటలు పెంచి, పెరిగి

పోయే జనానికి, కూడు,గుడ్డ కల్పించాలి. కొత్తపద్ధతులు నేర్చుకోవాలంటే, చదువు కుంటేనే చురుకుగా సాధ్యం అవుతుంది...చదువురాని నాబోటి వాళ్ళకి, క్రొత్త పద్ధతులా అర్థంకావు మరి ..ఒక్క వ్యవసాయంలోనే కాదు, పల్లెటూళ్లో వుండే వృత్తులన్నిటినీ, కొత్తపద్ధతిలో. చదువుకున్న యువకులే ఉద్ధరించాలి. అప్పుడే మన చదువులు సార్థకం అవుతాయి. రైతులనూ, చేతి వృత్తులవారినీ, ముఖ్యంగా ప్రైవేటు వడ్డీ వ్యాపారులు కబళించ కుండా ఉపాయాలు వెదకాలి. ఆనాడే దేశంలో జనాభా ఇంతకు పది రెట్లు పెరిగినా భయపడటం వుండదు.

ఆధునికమైన చదువులో ఆరితేరి, డిగ్రీలు సంపాదించుకున్నా, తండ్రికి అనుభవంమీద యేర్పడ్డ సిద్ధాంతాలు ప్రసాద్‌కు ఆశ్చర్యం పుట్టించినవి. అతనిలో యేదో విధమైన ఆవేశం పెల్లుబికింది.

''నేను తప్పక మీ ఆశయాలు నెరవేర్చగల ననుకొంటున్నాను నాన్నా ?'' అనిమాత్రం అనగలిగాడు. ఆ మర్నాడు ఇల్లంతటా పండగనాటి వాతావరణం ఏర్పడ్డది.

ఎం. ఏ. పాసైన ప్రసాద్ ఉద్యోగం చేయకుండా వ్యవసాయం పట్టడం, శ్రద్ధాసక్తులతో పొలం పనులు చూసుకుంటూ వుండటం, తండ్రిలాగే పొలంలో శ్రమపడటం చుట్టుపట్లవారందరికీ వింతగా ప్రథమంలో కనిపించింది ... తరువాత ప్రతివారూ అతని చురుకుతనాన్ని అభినందించకుండా ఉండలేకపోయారు. తమ కొడుకులకి, అతణ్ణి ఉదాహరణగా చూపి, బుద్ధులుచెప్పి, మందలించడం కూడా ఇతర్లకి పరిపాటై పోయింది. ఇతనితోపాటు మరికొందరు మధ్యరకం చదువులుగల కుర్రాళ్ళుకూడా, ఎంప్లాయ్‌మెంటు ఆఫీసుముందు 'క్యూ' లో నిలబడటం మానుకొని, వ్యవసాయం, గ్రామ స్థితిగతులు చూసుకోడానికి ముందుకు వచ్చారు. ఇదంతా ఒక జట్టుగా తయారైంది తుదకు. ఈ యువక జట్టు నాయకుడు ప్రసాద్...కాశీనాథ్‌కు తనశ్రమ తప్పిందన్న సంతోషంకన్నా, తనకొడుకు తనకన్నా శ్రద్ధగా వ్యవసాయం అభివృద్ధి చేసుకుంటున్నందుకు సంతోషం, గర్వం అధికంగా అనుభవిస్తున్నాడు.

సంవత్సరం, రెండు సంవత్సరాలు, మూడు సంవత్సరాలు గిర్రున తిరిగి వచ్చినవి రాయపురం మునుపటిలా లేదు ఒక మాధ్యమిక పాఠశాల, ఒక ఉన్నత పాఠశాల వూళ్ళో వెలిశాయి. బడికిపోని పన్నెండేళ్ళ లోపు కుర్రవాడంటూలేడు...వూరి మొత్తం మీద పది ఆధునిక ట్రాక్టర్లూ తదితర వ్యవసాయ యంత్రాలూ కొనుగోలు చేశారు రైతులు...వీటి నిర్వహణకు ప్రసాద్

అధ్వర్యంలో ఒక కమిటీ ఎన్నికైంది. అవసరంవున్న ప్రతిరైతుకూ స్వల్పంగా అద్దెమీద వీటిని సప్లైయి చేయటంతో ప్రారంభమైన యీ కమిటీ, రానురాను గ్రామ బహుళార్థసాధక సహకార సంఘంగా రూపొందింది. చుట్టుపట్ల దారి డొంకలు లేకుండా వున్న వూళ్ళన్నిటికీ రాయపురంతో మార్గసౌకర్యాలు ఏర్పాటు కావడంతో యీసంఘం కృషి విస్తృతమై పది గ్రామాలకు వ్యాపించింది...కుందన్ పూర్ డాక్టర్ దేవానందశర్మ సహాయముతో అక్కడ మరొకఉన్నత పాఠశాల, ఒక వ్యవసాయ పరపతి సంఘం వెలసినవి. రైతులకు అప్పులూ, యెరువులూ, వ్యవసాయ పరికరాల నిమిత్తం ఎక్కడికో వెళ్ళే పనిలేకుండా యీ పరపతి సంఘాలు చూస్తూ సమర్థవంతంగా నిర్వహించబడుతూండడంతో రెండేండ్లలో వివిధ పంటలు రెట్టింపయినవి...రాయపురంలో ఒక చేతి వృత్తుల పరిశ్రమ కేంద్రం, హైస్కూల్ లో చిత్ర కళావిభాగం యేర్పాటు చేయించాడు ప్రసాద్... రాయపురం ఆదర్శ గ్రామంగా మారి ప్రభుత్వ శ్రద్ధాసక్తులకు పాత్రమైంది.

ఇదంతా, ఒక వ్యక్తివల్ల కలిగిన మహత్తర విప్లవ చైతన్యంగా అంతా భావించేవారు. కాని, విజ్ఞానం ప్రసాదించిన అభివృద్ధి అనీ, ఇందుకు కారణం తన తండ్రి అనీ ప్రసాద్ భావిస్తూండేవాడు.

కాశీనాథ్ సంతోషం బయటికి కనిపించకున్నా, తన కొడుకు చదువు వల్లనే యీ అభివృద్ధికి పునాది ఏర్పడిందనీ, విజ్ఞానమే అన్నిటికీ మూలమనీ అనుకునేవాడు...అందరూ కలిసి పనిచేసి, అంతా సుఖపడటం అన్న వేదసూక్తి అక్షరాలా అమలు జరుగుతున్నందుకు తన కలలు ఫలించినట్లై, పరమ తపస్విలా మారిపోయాడు కాశీనాధ్.

రమేశ్ ఇంజనీరింగ్ పరీక్ష చదివి పాసైనాడు. లీల, శోభ, ఇద్దరూ డాక్టరీ చదువులో వున్నారు...కొడుకు అంగీకారంతో కాశీనాధ్ భారతదర్శన యాత్రకు బయలుదేరాడు భార్యతో సహా.

తన పంటపొలం యెప్పుడూ పకపక నవ్వుతూనే వుంటుందనీ, తన ఆశయం పూర్తి అయిందనీ గట్టిగా నమ్మకం కుదిరింది కాశీనాధ్‌కు. కాశీనాథ్ ఇప్పుడు రైతుపెద్ద..చదువుకున్న బుద్ధిమంతుడైన రైతు యువకుడికి కన్నతండ్రి....యీ భావం అతనిలోకలిగి, స్మృతికి వచ్చినప్పుడల్లా, అంత వృద్ధాప్యంలోనూ మళ్ళీ పలుగూ, పారా పుచ్చుకోవటానికి తగిన బలం కాశీనాథ్ బాహువులలో పొంగుతుంటుంది. ★